


# మంచెంకథ కుంచెంకథ

తూలికా భూషణ్

"ఏమిటోరా! విలువలు పడిపోతున్నాయి. ఈ కాలం చాలా చెడ్డది. చచ్చు పుచ్చు సాహిత్యం పుట్టుకు వస్తూంది. అదేమిటో మరి- దాన్నే మేసేస్తున్నారు జనం" అని వాపోయాడు మా మిత్ర బృందంలో పండితుడుగా పోజులు పెట్టే జులపాల రాయుడు వెంకట్రాముడు.

"పోనీ నీ మెదడు ఉపయోగించి- అసలు నీకు మెదడంటూ ఉంటే- నువ్వు గొప్ప సాహిత్యం సృష్టించరాదుట్రా వెంకటే?" అని నిలదీశాడు నరసింహం.

"నేను పండితుణ్ణి. నీలా చెత్త కథలు వ్రాసి అమ్ముకుని బ్రతికే దౌర్భాగ్యం నాకీజన్మలో పట్టదు" అన్నాడు కోపంగా, వెంకట్రాముడు. మా నరసింహం కథకుడు.

"కథలు వ్రాయవు కాని. కథలు వ్రాసి అమ్ముకుని నేను సంపాదించిన డబ్బుల్తో కాఫీ పోయిస్తే పీపాలో పోసినట్లు కడుపులో పోసుకోగలవు!" అన్నాడు నరసింహం.

వెంకట్రాముడు సమాధానం ఇవ్వడానికి సందివ్వకుండా నరసింహమే అన్నాడు:

"కాఫీ అంటే జ్ఞాపకం వచ్చింది. వెనకటికి ఓహెన్రీ స్నేహితులతో కలిసి ఒక హోటల్‌లో వున్నప్పుడు ఇతివృత్తాలు ఎలా లభిస్తాయనే ప్రశ్న వచ్చింది." ఓ హెన్రీ అనే గొప్ప కథా రచయిత ఒకడు పుట్టినట్లు, వందలాది కథలు వ్రాసినట్లు, వాటిలో కొన్ని శాశ్వతంగా నిలిచి ఉండేవని మన మహా పండితులు వెంకట్రాములుంగారికి తెలిసి ఉండదనుకో. అది వేరే సంగతి. "ఏమండీ మీ కథలకు ఇతివృత్తాలు ఎలా ఎన్నుకొంటారు?" అని ఒక మిత్రుడు ప్రశ్నించాట్ట.

"ఓ హెన్రీ ఆ టేబుల్ మీది మెనూ కార్డు తీశాట్ట "ఏముందీ! ఈ మెనూ కార్డు ఒక ఇతివృత్తాన్ని ఇవ్వవచ్చు" అంటూ దాన్ని ఆధారం చేసుకొని ఒక కథ చెప్పాట్ట. అది తరవాత అచ్చయింది...."

వెంకట్రాముడు తక్కువ తిన్నవాడు కాదు.

"అవునవును. వాడెవడో ఓ హెన్రీ అనే తల మాసినవాడు హోటల్‌లో మెనూ కార్డు మీద ఆస్పత్రిలో కూర్చుని మెనోపాజ్ మీద, మంగలి షాపులో కూర్చుని మీసాల మీద కథలు వ్రాస్తాడు. నువ్వేమో ఇంట్లో కూర్చుని మంచాలమీద, కుంచాలమీద కథలు వ్రాస్తావు. అఘోరించినట్లే ఉంది సాహిత్యం" అన్నాడు వెంకట్రాముడు.

నరసింహానికిది మామూలే కనక తొణకలేదు.

"ఒరేయ్! మంచం అంటే జ్ఞాపకం వచ్చింది. మొన్న మల్లికార్జునుడుగారి ఇంటికి వెళ్ళాను" అన్నాడు.

"ఎవరూ? మనకి అయిదో తరగతి దాకా చెప్పిన మల్లికార్జునుడు గారేనా?" అని అడిగాడు.

"ఒరేయ్! నీ మేధ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందిరా! ఆ మల్లికార్జునుడిగారిని మరవడం నీ తరం కాదు. చింత బరికెలతో చచ్చేదెబ్బ తిన్నావు. పాపం!" అని నవ్వాడు నరసింహం.

"మన విశ్శుగాడి తాత మల్లికార్జునుడు గారు- ఆయన" అని అందించాడు వెంకట్రాముడు.

"వెంకటూ! పండితుడివైనా నీ బుర్ర అప్పుడప్పుడు పనిచేస్తూనే వుంటుంది- పాచరసంలా. అవును- విశ్శు తాతగారు ఆయన ఈమధ్య పోయారు...." అని నరసింహం అంటూంటే-

"అరే పాపం! మాకు తెలియనే తెలియదు" అని బాధపడ్డాము వెంకట్రాముడూ, నేనూ.

"అప్రనా నాకూ తెలియదు. సిండికేట్ మీటింగుకి వెళ్ళి వచ్చిన తరవాత తెలిసింది. పరామర్శించడానికి విశ్శుగాడి ఇంటికి వెళ్ళాను. అదో కథలే" అన్నాడు నరసింహం.

"చెప్పరా" అన్నాము.


* * *

మల్లికార్జునుడుగారు పోలీసు డిపార్ట్‌మెంటులో పనిచేశారు. సబ్ ఇన్‌స్పెక్టరుగా పనిచేశారు.

నీతి, నిజాయితీ కలవాడు మల్లికార్జునుడు గారు. అలాంటి వాళ్ళందరికీ పట్టేగతే ఆయనకూ పట్టింది. ఎవరో, ఏదో కేసులో ఇరికించి ఆ ఉద్యోగం కాస్తా ఊడగొట్టించారు.

ఆ దెబ్బకు తట్టుకోలేకపోయారు మల్లికార్జునుడుగారు. మంచం పట్టారు.

అంతకు ముందు విశ్శు అని మిత్రబృందం పిలిచే విశ్వనాథం పుట్టినప్పుడు విధి వక్రించింది. మల్లికార్జునుడుగారి భార్య పురిటిలోనే మరణించింది.




మల్లికార్జునుడుగారు తల్లి, తండ్రి తానే అయి విశ్శును పెంచారు. ప్రాణప్రదంగా చూసుకొన్నారు. ఎవరెంత చెప్పినా మళ్ళీ పెళ్ళి అనే ఊహకే తావీయలేదు మల్లికార్జునుడుగారు.

మల్లికార్జునుడుగారికి పెద్దలు ఇచ్చిన ఆస్తి లేదు. ఆయన సంపాదించిన ఆస్తిపాస్తులు అసలే లేవు.

ఆయనకు భగవంతుడిచ్చిన ఆస్తి రత్నాల్లాంటి ముగ్గురు కుమారులు.

అదృష్టం అంతా ఆయన ఉద్యోగం వూడిపోయిన సమయానికి పెద్దకొడుకు లింగమూర్తి పట్టభద్రుడు కావడమే కాకుండా ఒక ప్రైవేటు కంపెనీలో చెప్పుకోదగిన ఉద్యోగం చేస్తూ వుండడమే.

ఉద్యోగం అన్యాయంగా ఊడిపోయిన దిగులుతో, చిరకాలంగా మనసును దొలిచివేస్తూ వచ్చిన భార్యావియోగ భారంతో, ఆరోగ్యం పూర్తిగా చెడి మంచానపడి కొడుకులమీద ఆధారపడిన స్థితికి తట్టుకోలేక అంతకంతకు దిగజారిపోతూ వచ్చారు మల్లికార్జునుడుగారు.

తండ్రి వహించవలసిన బాధ్యత అంతా ఆనందంగా నెత్తి మీద వేసుకొని, ఆయన బెంగ తీర్చడానికి అహోరాత్రమూ తాపత్రయపడుతూ వున్నాడు లింగమూర్తి.

రెండవ వాడు శరభయ్య. తల్లి పోయిం తరవాత అన్నగారిని ఒప్పించలేకపోయినా ఆయన ఉద్యోగం వూడిన తరవాత సరేనని పించి దత్తం చేసుకున్నాడు పినతండ్రి వీరభద్రంగారు.

శరభయ్య సమస్య మల్లికార్జునుడుగారికి లేకుండాపోయింది ఆ విధంగా.

విశ్శును మాతోపాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ చేయించి మాతోబాటే కాలేజీలో


## తెలుగువారిలో 1982 ప్రముఖ వ్యక్తి?

గత సంవత్సరం-అనగా "1982 లో తెలుగు వారిలో ప్రముఖ వ్యక్తి ఎవరు?" అనే శీర్షికకు మా పాఠకులు 28-2-1983 లోపున తమ నామినేషన్లను పోస్టు కార్డు మీద కానీ, ఇన్‌లాండ్ లెటర్‌మీద కానీ వ్రాసి పంపితే 1983 మార్చి నెలలో ఫలితాలను పత్రికా ముఖంగా ప్రకటిస్తాము.

చిరునామా:

"తెలుగు వారిలో ప్రముఖ వ్యక్తి"

C/o ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, లబ్బీపేట, బాక్సు నెం. 712

విజయవాడ-520 010.

—ఎడిటర్

లెక్చరరును చేయించిన ఘనత లింగమూర్తిది.

తండ్రిని, తమ్ముణ్ణి రెండు కళ్ళలా చూసుకొన్నాడు లింగమూర్తి.

* * *

అన్నీ అనుకొన్నట్లు, ఆనందదాయకంగా సాగిపోయేదెప్పుడు?

* * *

ఒక రోజు లింగమూర్తి కూతురు పార్వతి పరుగున తాతగారి దగ్గరికి వచ్చి, "మంచం ఖాళీ అవడం అంటే ఏమిటి తాతగారూ?" అని అడిగింది.

గతుక్కుమన్నారు మల్లికార్జునుడుగారు.

"ముసలాణ్ణి- నాకేం తెలుస్తుందమ్మా?" అన్నారు నవ్వుతూ. ఆ పసిదాని మనసు ఇతర విషయాల మీదికి మళ్ళించారు.

మల్లికార్జునుడు గారికి కోడలు ఆంతర్యం తెలుసు.

గత వైభవ చిహ్నంగా, తండ్రి తాతలు మిగిల్చిపోయిన ఆస్తి ఒక పందిరి పట్టె మంచం. అది యిప్పుడు మల్లికార్జునుడుగారి అవిటి బ్రతుక్కి ఆధారంగా వుంది.

వివాహమై, ఆ ఇంటి కోడలుగా అడుగు పెట్టిన క్షణంనుంచి ఆ మంచంమీద వుంది లింగమూర్తి భార్య భ్రమరాంబ దృష్టి.

ఇంకొక మంచంకొని ముసలాయనను దానిమీద కెక్కించి ఆ పందిరి పట్టెమంచం స్వాధీనం చేసుకొందామంటే—

స్థితిగతులు అదుపులో లేక అంత డబ్బు లింగమూర్తి వెనక వేయలేకపోయాడు. అసలు ఆ పందిరి పట్టె మంచంమీద అతడి కన్ను ఎప్పుడూ పడలేదు. ఆ మంచానికి, తండ్రికి అవినాభావ సంబంధం ఏర్పడిపోయింది అతడి మనసులో. అతడేమిటి? దత్తు వెళ్ళినా శరభయ్య మనసులోనూ ఆఖరివాడు విశ్వ దృష్టిలోనూ అలాంటి భావమే పాదుకొనిపోయింది.

ఆ మంచం విడిచి మరొక చోట ఉండగలరా మల్లికార్జునుడుగారు? అలాంటి ఆలోచన సహించలేరాయన.

కోడలు దృష్టి ఆ మంచం మీద ఉందని మల్లికార్జునుడుగారికి తెలుసు. ఆమె భావన తెలుసు.

మల్లికార్జునుడుగారు మరింత దిగజారిపోసాగారు.

ఒక రోజు ఎవరో స్నేహితురాలితో మాట్లాడుతూ—

"ఆ ముసలాడు ఇప్పట్లో చావడు. అతడు పోతేగాని ఆ మంచం ఖాళీ అవదు" అని భ్రమరాంబ లోగొంతుకలో అంది. ఆఖరి మాటలు పార్వతి వింది. పరుగున తాతగారి దగ్గరికి వెళ్ళి అడిగింది.

ఆ మాటలు తాతగారు కూడా విన్నారని


# ఆంధ్రజ్యోతి

సచిత్ర వార పత్రిక

## 1983 రుధిరోద్గారి ఉగాది కథల పోటీ

## రూ. 3,000/- బహుమతులు

రుధిరోద్గారి 1983 ఉగాది సందర్భంగా, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక కథల పోటీ నిర్వహిస్తోందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. రచయితలూ, రచయిత్రులూ ఉగాది కథల పోటీలో పాల్గొని మాతో సహకరించవలసిందిగా కోరుతున్నాము.

మొదటి బహుమతి రు. 1,500/-
రెండవ బహుమతి రు. 1,000/-
మూడవ బహుమతి రు. 500/-

**కథల పోటీలో పాల్గొనువారు పాటించవలసిన నిబంధనలు :**

1. కథ తెలుగు జీవితానికి సంబంధించినదై వుండాలి. అనువాదాలు, అనుసరణలు స్వీకరించబడవు.
2. 10, 12 అరఠావులకు మించిన పెద్ద కథలు స్వీకరించబడవు.
3. కథ తమ స్వీయ రచన అనీ, అముద్రితమనీ వ్రాతపూర్వకమైన హామీతో సంతకం చేసి కథతోపాటు పంపాలి.
4. కలం పేరు కాక, అసలు పేరు, పూర్తి చిరునామా యివ్వాలి.
5. పోటీకి పంపిన కథలు తిప్పి పంపబడవు. స్టాంపులు అంటించిన కవరు కథతో పాటు పంపనవసరం లేదు.
6. "ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 1983 రుధిరోద్గారి ఉగాది కథల పోటీకి" అని కవరుమీద స్పష్టంగా వ్రాయాలి. పోటీలో బహుమతికి యోగ్యమైనవిగా కథలను ఎన్నుకునే విషయంలో ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక సంపాదకవర్గం నిర్ణయమే తుది తీర్పు. ఈ విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.
7. బహుమతి పొందిన కథలూ, వాటి వివరాలను ఉగాది సంచికలో ప్రకటిస్తాము. బహుమతికి ఎన్నుకున్న కథలేగాక ప్రచురణకు యోగ్యమైనవని భావించిన కథలు కూడా ఎన్నుకుని పారితోషికమిచ్చి ప్రచురిస్తాము.

**కథలు చేరవలసిన ఆఖరు తేదీ : 15 మార్చి 1983**

ఎడిటర్,
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక,
పోస్టు బాక్సు నెం. 712,
విజయవాడ-520 010కి పంపాలి.

పాపం ఆ మనుమరాలికి తెలియదు.

ఆ సంసారంలో ఇంక ఎలాంటి యితర పొరపొచ్చాలూ లేవు.

పందిరి పట్టెమంచం మాత్రం ఇరువురి మనసుల్ని డోలిచేస్తూ వుంది జ్ఞాతంగాను, అజ్ఞాతంగాను కూడా.

* * *

లింగమూర్తికి దూరప్రదేశానికి బదిలీ అయింది. వెళ్ళక తప్పలేదు.

తండ్రి సంరక్షణ బాధ్యత తమ్ముడికి అప్పగించి వెళ్ళాడు లింగమూర్తి. తమ్ముడి మీద అఖండమైన నమ్మకం వున్న లింగమూర్తికి ఆ విషయంలో నిశ్చింత.

పందిరి పట్టె మంచంవంక విషపు చూపు ఒకటి పారేసి వెళ్ళింది భ్రమరాంబ.

* * *

సాన్నిహిత్యం వైమనస్యానికి దోహదం చేస్తే వియోగం దానిని హరింపజేస్తుంది.

దూరమైన తరువాత భ్రమరాంబ ఆలోచనా సరళిలో మౌలికమైన మార్పులు చాలానే వచ్చాయి.

మరిదికూడా సంపాదిస్తూ తండ్రిని చూసుకుంటూ వుండడంతో ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. ఇంతకుపూర్వం కొరవడిన చాలా సామగ్రి అమర్చుకొంది భ్రమరాంబ. వాటిలో పందిరి పట్టె మంచం అతి ముఖ్యమైనది.

కన్నకూతురులా తనను మొదటినుంచి అభిమానిస్తూ వచ్చిన మామగారిపై ప్రేమ పదింతలయింది.

ఆ స్థితిలో వచ్చింది టెలిగ్రామ్—

"నాన్నగారు పోయారు. వెంటనే బయలుదేరి రా" అంటూ విశ్వం పంపినది.

* * *

దూరప్రదేశం కావడంతో లింగమూర్తి రావడం ఆలస్యమైంది.

ఇలాంటి విషయాలలో అతి ఛాందసమైన నమ్మకాలు వున్న జాతి తెలుగు జాతి. ఇరుగు పొరుగుల ఒత్తిడి భరించలేక అన్నగారి మీద కర్తృత్వం వుంచి తండ్రికి అంత్యక్రియలు జరిపాడు విశ్వం. జరపక తప్పలేదనడం వాస్తవానికి దగ్గరగా వుంటుంది.

* * *

"పరామర్శించడానికి నేను వెళ్ళిన పది నిమిషాలకు లింగమూర్తి, వదిన, పాప (పార్వతి) వచ్చారు.

పాప పరుగున సావిడిలోకి వచ్చింది. తాతగారి మంచం వంక చూసింది.

"మంచం ఖాళీ అయిపోయిందే అమ్మోయ్!" అని ఒక కేక పెట్టింది.

వదిన అప్పుడే సావిడిలో అడుగు పెట్టినది- అలాగే కూలబడి స్మృతి కోల్పోయింది. కూతురు మాటలు అశనిపాతంలా ధ్వనించాయి ఆమె చెవుల్లో".

* * *

అప్పటికీ, ఇప్పటికీ మల్లికార్జునుడుగారి మంచం ఖాళీగానే ఉండిపోయింది, మరి!

## మాయరోగం!

ఆకలి తీరిన
సింహం
దర్జాగా



రెక్కలొచ్చిన
పక్షి
రికామీగా
మనకే,,

—నందివాడ భీమారావు

ఆంధ్రజ్యోతి
సచిత్ర వార పత్రిక

అనుభవ చంద్రోదయంతో గడ్డకట్టిన జీవితంనుంచి కరిగిన చంద్రకాంత శిల, స్వాతి చకోరం జీవిత చంక్రమణం!

చంద్రోదయం

-మన్నెం శారద

విజయదశమి నవలల పోటీలో రెండవ బహుమతి రు. 3000-లు అందుకున్న నవల!

త్వరలో!



నేడే టి. వి. కొనండి స్పష్టమైన ప్రసారాలు తిలకించండి

విజయ టి.వి. & వీడియో హోమ్

15, రెవిన్యూ కాంప్లెక్స్, జిన్నాటవర్, గుంటూరు-1

(డీలర్స్ : వెస్టన్, భారత్, కెల్ట్రాన్, సాలిడైర్ మరియు టెక్నిక్స్)
వివిధ కలర్ మరియు బ్లాక్ & వైట్ టి. వి. ల, వీడియోల ప్రత్యేక షోరూం.

వివాహాలకు, వేడుకలకు వీడియో షూటింగ్ మా ప్రత్యేకత

గమనిక : కలర్ మరియు బ్లాక్ & వైట్ టి. వి.ల స్కీములు కలవు.